# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

**పత్రికా ప్రకటన** **తేది: 29-02-2016**

రాష్ట్రంలో వెనుకబడిన తరగతులకు, దళితులకు, మహిళలకు అమలవుతున్న విధంగానే మైనారిటీలకు కూడా సంక్షేమ పథకాలు అమలు కావాలని ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్ రావు అధికారులను ఆదేశించారు. మైనారిటీల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాల పురోగతిపై అధికారిక నివాసంలో ఆదివారం ముఖ్యమంత్రి సమీక్ష జరిపారు.

ఈ సమావేశంలో ఎంపి వినోద్ కుమార్, ఎంఐఎం నేతలు అసదుద్దీన్ ఒవైసి, అక్బరుద్దీన్ ఒవైసి, మైనారిటీ వెల్ఫేర్ శాఖ కార్యదర్శి ఉమర్ జలీల్, ఏసీబీ డైరెక్టర్ జనరల్ ఎ.కె.ఖాన్, సీఎం ప్రత్యేక కార్యదర్శి భూపాల్ రెడ్డి, లా సెక్రటరీ సంతోష్ రెడ్డి పాల్గొన్నారు. ముస్లింలకు ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నిరకాల పథకాల అమలు తీరు గురించి సిఎం అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. షాదీ ముబారక్ పథకంతో సహా విద్యార్థుల స్కాలర్ షిప్పులు, ఫీజు రీఇంబర్స్ మెంట్, డబుల్ బెడ్ రూం ఇండ్లు, ఉపాధి శిక్షణ, ఉద్యోగాల కల్పన, స్కిల్ డెవలప్ మెంట్ తదితర పథకాలన్నీ ముస్లిం లబ్దిదారులకు అందాలన్నారు. క్షేత్ర స్థాయిలో ఇప్పటి వరకు 26,635 మంది షాదీ ముబారక్ పథకం ద్వారా లబ్ది పొందారని తెలుసుకుని సీఎం సంతృప్తి వ్యక్తం చేశారు. షాదీ ముబారక్ పథకం అమలులో తలెత్తుతున్న కొన్ని లోపాలను సిఎం దృష్టికి తీసుకురాగా పేద ముస్లిం యువతకు చేరాల్సిన నిధులు పక్కదారి పట్టించే బ్రోకర్లను ఐరన్ హ్యాండ్ తో డీల్ చేయాలని పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించారు. ముస్లిం యువతకు అవకాశం దొరికితే అద్భుతమైన ప్రయోజకులుగా మారుతారని స్పష్టం చేసిన ముఖ్యమంత్రి వారికి ఇంజనీరింగ్, ఉన్నత విద్య, వృత్తి విద్య తదితర రంగాల్లో ప్రభుత్వం ఖర్చుతో ఉన్నతమైన శిక్షణను అందించాలని సూచించారు. హైదరాబాద్ పరిధిలో పెండింగులో ఉన్న జూనియర్, డిగ్రీ తదితర కళాశాలల భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. బడ్జెట్ కేటాయింపులు జరిగిన తరువాత కూడా అమలులో ఆలస్యం అయితే సహించేది లేదన్నారు.

"మైనారిటీ అనంగనే నిర్లక్ష ధోరణి ఆహ్వానించదగ్గ పరిణామం కాదు. మైనారిటీ సంక్షేమాన్ని గత పాలకులు నిర్లక్ష్యం చేశారు. బడ్జెట్ కేటాయింపుల్లో పక్షపాతం చూపించారు. మన ప్రభుత్వం సరిపోను బడ్జెట్ ను మైనారిటీ సంక్షేమానికై కేటాయించింది. ఎన్ని నిధులు ఖర్చయినా పర్వాలేదు మైనారిటీల కోసం ప్రభుత్వం

చేపట్టిన సంక్షేమ పథకాలు అవాంతరాలు లేకుండా కొనసాగించే బాధ్యత మీదే" అని సమీక్షలో పాల్గొన్న అధికారులకు సిఎం స్పష్టం చేశారు. జిహెచ్ఎంసి పరిధిలో అన్యాక్రాంతం అయిన వక్ఫ్ భూములను గుర్తించి వక్ఫ్ బోర్డుకు అప్పజెప్పాలని, ప్రభుత్వం అభివృద్ధి పనుల్లో భాగంగా వక్ఫ్ బోర్డు కోల్పోయిన స్థలాలకు సంబంధించిన నష్ట పరిహారాన్ని జిహెచ్ఎంసి వెంటనే చెల్లించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

"ముస్లిం యువత అంటే కేవలం ఎలక్ట్రీషన్, మెకానిక్, ప్లంబర్ పనులు చేసే వాళ్లే కాదు వాళ్లను గొప్ప గొప్ప కాంట్రాక్టర్లుగా చూడాలన్నదే నా ధ్యేయం" అని స్పష్టం చేసిన సిఎం మైనారిటీ యువతకు టిఎస్ ఐ పాస్ కింద ఐటి పార్కులను ఏర్పాటు చేసి ఎంటర్ ప్రిన్యూర్సుగా తయారు చేయాలని సూచించారు. పోటీ పరీక్షల్లో పాల్గొనే ముస్లిం విద్యార్థులకు తమ మాతృ భాష ఉర్దూలో రాసేందుకు అనుమతి ఇవ్వాలని, అందుకు తగ్గ చర్యలు తీసుకోవాలని విద్యాశాఖాధికారులను ఆదేశించారు. ఉపాధి కల్పనలో ముస్లిం యువతకు అధికారులు అండగా నిలవాలని, అర్హులైన యువతకు ఆర్థిక సహాయం అందించే దిశగా మైనారిటీ ఫైనాన్స్ కార్పోరేషన్ పని విధానాన్ని మరింత మెరుగుపరచాలన్నారు.

హుస్సేని షావలి దర్గా, బియా బాని దర్గా, ఫకీర్ ముల్లా దర్గా తదితర దర్గాలకు చెందిన వందల ఎకరాల భూమి అన్యాక్రాంతం కాకుండా తక్షణమే సర్వే నిర్వహించి వక్ఫ్ బోర్డుకు అందజేయాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కు ఆదేశాలు ఇచ్చారు. మక్కా మసీదు కట్టడానికి సంబంధించిన పునరుద్దరణ పనులు రంజాన్ పండుగలోపు పూర్తి చేయనున్నట్లు తెలిపిన ముఖ్యమంత్రి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కాగానే మైనారిటీ సంక్షేమానికి సంబంధించి విస్తృత స్థాయి సమీక్షను చేపట్టనున్నట్లు చెప్పారు. రానున్న ఏప్రిల్ నెలలో చేపట్టబోయే పోలీసు నియామకాల్లో ముస్లిం యువత భాగస్వామ్యం మరింత పెరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించిన ముఖ్యమంత్రి అందుకు సంబంధించి శిక్షణనిచ్చేందుకు అత్యున్నత నాణ్యత కలిగిన శిక్షణా సంస్థలను గుర్తించి ఖర్చులకు వెనకాడకుండా కోచింగ్ ఇప్పించాలని మైనారిటీ సంక్షేమ కార్యదర్శి ఉమర్ జలీల్ ను ఆదేశించారు. జూన్ నెల నుంచి మైనారిటి రెసిడెన్షియల్ పాఠశాలలను ప్రారంభించనున్నట్లు సీఎం చెప్పారు. అందుకు సంబంధించిన ఉద్యోగ నియామకాలు తక్షణమే చేపట్టాలన్నారు. టీచింగ్ సిబ్బందిని నియమించుకోవాలని, ఎక్కువ సంఖ్యలో అవసరమైనట్లయితే అర్హులైన ఇతరులను అవుట్ సోర్సింగ్ విధానంలో నియమించుకోవాలని సూచించారు. కాగా రెసిడెన్షియల్ పాఠశాలల కట్టడాలు ఆలస్యం అయ్యే చోట అనువైన భవనాలు ఎంపిక చేసుకుని అద్దెకు తీసుకుంటున్నట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

మైనారిటీ సంక్షేమం కోసం కేటాయించిన బడ్జెట్ లో రెసిడెన్షియల్ పాఠశాలల భవనాల నిర్మాణాలకు, స్వయం ఉపాధికై ముస్లిం యువతకు అందించేందుకు, షాదీ ముబారక్, ఫీజు రిఇంబర్స్ మెంట్, స్కాలర్ షిప్పులు తదితరాలకు సమ ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపిన సిఎం అవసరమైతే ఎస్డీఎఫ్ నుండి కూడా మైనారిటీ సంక్షేమానికి నిధులు కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. దారుల్ ఉలుమ్ లో ఆడిటోరియం నిర్మాణానికి రూ. 10 కోట్లు విడుదల చేయవలసిందిగా ఆదేశించారు. పాతబస్తిలో పలు చోట్ల నిర్మించ తలపెట్టిన జూనియర్, డిగ్రి కళాశాలల భవనాల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రతిష్టాత్మక జామై నిజామియా యూనివర్సిటీకి చెందిన కోర్సులకు గుర్తింపును పునరుద్ధరించాలని ఉప ముఖ్యమంత్రికి ఫోన్ లో చెప్పారు. మార్చి 31 లోపు మైనారిటీ విద్యార్థులకు సంబంధించి పెండింగులో ఉన్న ఫీజు రిఇంబర్స్ మెంట్ బకాయిలను నయా పైసా ఉంచుకోకుండా చెల్లించాలని మైనారిటీ ఫైనాన్స్ సెక్రటరీని ఆదేశించారు. డబుల్ బెడ్ రూం ఇండ్ల కోసం ముస్లిం ప్రజల నుండి దరఖాస్తులు రావడం పట్ల ముఖ్యమంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. అర్హులైన ముస్లిం పేదలందరికీ డబుల్ బెడ్ రూం ఇండ్లను కట్టిస్తామని సీఎం అన్నారు. ముస్లిం రిజర్వేషన్ల విషయంలో తమ ప్రభుత్వం ముస్లింల పక్షమే వహిస్తుందని సీఎం హామీ ఇచ్చారు.

**సిపిఆర్ఓ టు సిఎం**